క్లుప్తంగా

కలెక్టర్ ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సుజాతనగర్: దళితబంధు రెండో విడత లబ్ధిదారులను కలెక్టర్ ద్వారానే ఎంపిక చేయాలని కోరుతూ మండల దళిత ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఎంపీడీఓ టి.వెంకటలక్ష్మికి సోమవారం వినతిపత్రం అందజేశారు. వేల్పుల భాస్కర్, మురిపిటి మాధవరావు, సిరిగిరి మురళి, మురిపిటి నగేష్ పాల్గొన్నారు.

ఎరియర్స్ చెల్లించండి

సింగరేణి(కొత్తగూడెం): 11వ వేజ్‌బోర్డ్‌కు సంబంధించిన బొగ్గు పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు 23 నెలల ఎరియర్స్ కోలిండియాలో ఇస్తుంటే సింగరేణిలో మాత్రం ఇంత వరకు సర్క్యులర్ విడుదల చేయలేదని వెంటనే చెల్లించాలని సోమవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సింగరేణి అధికారులకు వినతిపత్రం అందజేశారు. వంగా వెంకట్, జి.వీరస్వామి, మల్లికార్జున్‌రావు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేయించుకోవాలి

టేకులపల్లి: 18 సంవత్సరాలు నిండి ఓటు హక్కులేని యువతీ, యువకులు ఓటరుగా నమోదు చేయించుకోవాలని టేకులపల్లి తహసీల్దార్ కొండపల్లి కృష్ణవేణి తెలిపారు. ఈ మేరకు సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా కానీ ఓటర్ హెల్ప్ యాప్ ద్వారా ఓటరుగా నమోదు చేసుకోవచ్చన్నారు. ఈనెల 30న ఓటర్ల జాబితా ప్రదర్శించడం జరుగుతుందని పేర్కొన్నారు. కుల, ఆదాయం, ఏజెన్సీ, తదితర ధృవీకరణ పత్రాలు, కల్యాణలక్ష్మి కోసం దరఖాస్తు చేసుకునే వారు నిబంధనల ప్రకారం దరఖాస్తు చేసుకోవాలని, అర్హత ఉన్నవారికి సకాలంలో ధృవీకరణ పత్రాలు అందజేయడం జరుగుతుందన్నారు.

నేతాజీ సంఘం సేవలు అభినందనీయం

పాల్వంచ: 30 ఏళ్లుగా నేతాజీ యువజన సంఘం సమాజానికి సేవలు అందించడం అభినందనీయం అని ప్రముఖ వైద్యులు సోమరాజు దొర, ప్రవీణ్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక వనమా కాలనీ నందు నేతాజీ యువజన సంఘం 31వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. కేక్ కట్ చేశారు. ఈ సందర్భగా నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాట్లాడుతూ.. యువజన సంఘం స్థాపించిన నాటి నుంచి అనేక స్వచ్ఛంద కార్యక్రమాలు చేస్తున్న కమిటీని అభినందించారు. వైద్యులు కె.స్వాతి, నామా బుచ్చయ్య, రామ్‌శెట్టి సుమంత్, వేముల కొండలరావు, నుమాన్ పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఆజాదీ ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు, విద్యార్థులు

జూలూరుపాడు: స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల సందర్భంగా జూలూరుపాడులో సోమవారం ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు ఆజాదీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి కాలంగి హరికృష్ణ మాట్లాడుతూ.. దేశానికి స్వాతంత్య్రం వచ్చి 76 ఏళ్లు అవుతున్నా పేదల బతుకులు మారలేదన్నారు. విద్య, వైద్యం, ఉద్యోగాలు పేదలందరికీ చేరలేదన్నారు. మరో స్వాతంత్యానికి భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్, అల్లూరి సీతారామరాజు, చంద్రశేఖర్ ఆజాద్‌ను యువకులు స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత పేదల సమస్యలు, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంలో విఫలమైందన్నారు. గార్లపాటి పవన్‌కుమార్, బోడా అభిమిత్ర, వల్లమల్ల చందర్‌రావు, పవన్, అనిల్, సంతోష్, భరత్, వికాస్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం మెరుగుపర్చుకోవాలి

ఇల్లెందురూరల్: పల్లెల్లో పారిశుద్ధ్యం మరింత మెరుగుపర్చాలని డీఎల్‌పీఓ రాజీవ్‌కుమార్ ఆదేశించారు. మస్సివాగు, ముత్తారపుకట్ట, పూబెల్లి, విజయలక్ష్మీనగర్ గ్రామపంచాయతీలలో సోమవారం ఆయన పర్యటించారు. ఆయా గ్రామపంచాయతీలలో ప్రతి వీధిని సందర్శించి పారిశుద్ధ్యం తనిఖీ చేశారు. మల్టీపర్పస్ వర్కర్లు నెలరోజులు సమ్మెలో ఉన్నందున పెండింగ్ పనులను ప్రణాళికాబద్ధంగా వేగవంతంగా పూర్తిచేయాలని సూచించారు. డంప్‌షెడ్డులో కంపోస్టు తయారీ నిరంతర ప్రక్రియగా ఉండాలన్నారు. అనంతరం కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. కార్మికులు రోజువారీగా చేస్తున్న పనులను కూడా రికార్డులలో నమోదు చేయాలని చెప్పారు.

వృత్తి విద్యపై అవగాహన లేమి!

- భర్తీకి నోచుకోని సీట్లు
- ఒకేషనల్ కోర్సులపై విస్తృత ప్రచారం
- ఇంటర్మీడియట్‌లో ఎంపీహెచ్‌డబ్ల్యూ(ఎఫ్)పై దృష్టి





ఎంపీహెచ్‌డబ్ల్యూ(ఎఫ్) ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు

ఇల్లెందు: ఇంటర్మీడియట్‌లో ఒకేషనల్ గ్రూపులతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. అవగాహన లేక విద్యార్థులు సద్వినియోగం చేసుకోలేపోతున్నారు. ప్రతి గ్రూపులో 40 సీట్లు ఉంటాయి. కానీ ఏ గ్రూపులోనూ 20 - 30 మంది మాత్రమే చేరుతున్నారు. ఈ విద్యాసంవత్సరంలో కళాశాల ప్రిన్సిపాల్ రామలింగేశ్వరరావు, అధ్యాపక బృందం కరపత్రాలు ముద్రించి అధ్యాపకులు, విద్యార్థులతో ఊరూరా, ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. ఇల్లెందు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మల్టీ పర్పస్ హెల్త్ వర్కర్ (ఎంపీహెచ్‌డబ్ల్యూ) (ఎఫ్) అనే గ్రూపును 2017–18లో ప్రారంభించారు. ఇప్పటి వరకు ఈ కళాశాలలో సుమారు 180 మంది ప్రథమ, ద్వితీయ సంవత్సరం పూర్తి చేశారు. వీరంతా ఉపాధి మార్గాలు పొంది స్థిరపడ్డారు. పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులలో నర్సులుగా చేరారు. ఎంతో ఉపయోగం ఉన్న ఈ కోర్సులను సద్వినియోగం చేసుకుంటే మంచి భవిష్యత్ ఉంటుంది. ఎంపీహెచ్‌డబ్ల్యూ(ఎఫ్) గ్రూపును సద్వినియోగం చేసుకోవాల్సిన బాధ్యత విద్యార్థుల మీద ఉంది. ఇలా ఇదే కళాశాలలో ఆఫీస్ అసిస్టెంట్ చీఫ్ (ఓఏ) గ్రూపు, మెకానిల్ టెక్నాలజీ (ఎంటీ) గ్రూపు, కన్‌స్ట్రక్షన్ టెక్నాలజీ (సీటీ) గ్రూపులతో పాటు రెగ్యులర్ గ్రూపులైన సీఈసీ, హెచ్‌ఈసీ, బైపీసీ, ఎంపీసీ గ్రూపులు కూడా ఉన్నాయి. అయితే అన్ని కోర్సు ప్రతి సెక్షన్‌కు 40 మంది విద్యనభ్యసించే అవకాశం ఉన్నా విద్యార్థులు ఏ గ్రూపులో కూడా పూర్తిస్థాయిలో చేరలేదు.

గిరిజన విద్యార్థులే అధికం..

ఇల్లెందు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గిరిజన విద్యార్థులే ఎక్కువగా ఉన్నారు. అయితే ఎస్‌ఎంహెచ్ హాస్టల్ సదుపాయం లేకపోతే ఈ కళాశాల మూతపడే ప్రమాదం ఉంది. ఇల్లెందులో 350 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తుండగా, వీరిలో ఎస్టీ విద్యార్థులు 250 మంది ఉండటం విశేషం.

సౌకర్యాలు భేష్...

ఇల్లెందు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సరిపడా భవనాలు ఉన్నాయి. ఐదేళ్ల క్రితం ఇక్కడ బాధ్యతలు చేపట్టిన ప్రిన్సిపాల్ రామలింగేశ్వరరావు శిథిలావస్థకు చేరుకున్న భవనాలను గుర్తించి మరమ్మతులు చేయించారు. ఇక్కడ 1969 నుంచి కళాశాల నడుస్తోంది. ఈ ఏడాది ఇంటర్ ఎంపీసీ ప్రథమ సంవత్సరంలో ఐదుగురు, బైపీసీలో 12మంది, సీఈసీలో 25 మంది హెచ్‌ఈసీలో 35 మంది విద్యార్థులు ఉన్నారు. అదేవిధంగా ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో ఎంపీసీలో 20 మంది, బైపీసీలో 25 మంది, సీఈసీలో 20 మంది, హెచ్‌ఈసీలో 30 మంది ఉన్నారు. ఒకేషనల్ ప్రథమ సంవత్సరంలో ఏఓలో 20 మంది, సీటీలో 20 మంది, ఎంటీలో 20 మంది, ఎంపీహెచ్‌డబ్ల్యూ(ఎఫ్)లో 35 మంది విద్యార్థులు ఉన్నారు. ఇక ఒకేషనల్ ద్వితీయ సంవత్సరంలో ఏఓలో 20 మంది, ఎంటీలో 20 మంది, సీటీలో 20 మంది, ఎంపీహెచ్‌డబ్ల్యూ(ఎఫ్)లో 30 మంది విద్యార్థులు ఉన్నారు.



ఇల్లెందు ప్రభుత్వ జూనియర్ కళాశాల

తరగతులు మొదలయ్యాయి



ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంపీహెచ్‌డబ్ల్యూ(ఎఫ్) గ్రూపులో చేరాను. నెల రోజులుగా క్లాసులు జరుగుతున్నాయి. ప్రతిరోజూ వేపలగడ్డ గ్రామం నుంచి వస్తున్నాను. మల్టీపర్పస్ హెల్త్ వర్కర్ కోర్సు పూర్తి చేసి నర్సుగా స్థిరపడాలనుకుంటున్నాను. అదేవిధంగా కుటుంబానికి అండగా ఉండాలని ఈ గ్రూపులో చేరాను.

– వైష్ణవి, ఎంపీహెచ్‌డబ్ల్యూ(ఎఫ్) వేపలగడ్డ

ఎంతో ఉపయోగం..



టేకులపల్లి మండలం తుమ్మలచెలక గ్రామం నుంచి వచ్చి ఎంపీహెచ్‌డబ్ల్యూ(ఎఫ్) రెండో సంవత్సరం చదువుతున్నాను. ఈ గ్రూపు వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. నర్సుగా సేవలు అందించటంతో పాటు జీవితంలో స్థిరపడే అవకాశం ఉంది. అవగాహన లేకపోవటం వల్ల ఈ గ్రూపులో ఎక్కువ మంది చేరటం లేదు.

– సరస్వతి, ఎంపీహెచ్‌డబ్ల్యూ(ఎఫ్), తుమ్మలచెలక

హాస్టల్ సదుపాయం కల్పించాలి...



ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు చేరాలంటే జూన్ 1 నాటికి అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తే విద్యార్థులు ఆసక్తి చూపుతారు. ఇక ప్రైవేట్ కళాశాలల్లోనూ ఎక్కువ సెక్షన్లకు అనుమతి ఇవ్వకూడదు. సుదూర ప్రాంతాల వారి కోసం అందుబాటులో హాస్టల్ సదుపాయం తప్పక ఉండాలి.

– రామలింగేశ్వరరావు, ప్రిన్సిపాల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఇల్లెందు

పోస్టులో సీఎంకు కిన్నెరసాని నీళ్లు



పోస్టాఫీస్‌లో పార్సిల్ ఇస్తున్న బీఎస్పీ నాయకులు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం పట్టణ ప్రజలకు కిన్నెరసాని నుంచి అందించే నీరు బురదగా వస్తున్నాయని దీంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నందున సంబంధిత అధికారులు మేల్కోవాలని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ కోరారు. కొద్దిరోజులుగా ఈ సమస్యపై ప్రజలు ఇబ్బంది పడతున్నా ఎవరూ పట్టించుకోకపోవడంతో పార్టీ శ్రేణులతో కలిసి సోమవారం ఆందోళన కార్యక్రమం చేపట్టారు. అనంతరం స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యను ముఖ్యమంత్రి కేసీఆర్ స్వయంగా పర్యవేక్షించాలని కోరుతూ బురద నీటిని క్యాన్‌లో పోస్ట్ ద్వారా సీఎం కేసీఆర్‌కు పంపించి వినూత్న రీతిలో నిరసన తెలిపారు. కామేష్ మాట్లాడుతూ.. గతంలో పలుమార్లు ఈ విషయాన్ని స్థానిక అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారని మండిపడ్డారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని లేదంటే ఈనెల 16న మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గంధం మల్లికార్జున్‌రావు, సాయి, వంగా రవిశంకర్, రాకేష్, నిరంజన్ పాల్గొన్నారు.

పైపులైన్ వాల్వ్‌కు మరమ్మతులు



మరమ్మతులు చేస్తున్న మున్సిపాలిటీ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

పాల్వంచ: అల్లూరి సెంటర్ రోడ్డులో ఇటీవల మున్సిపాలిటీ తాగునీటి పైపులైన్ ఎయిర్ వాల్వ్ లీకేజీ ఏర్పడి వృథా అవుతోంది. సోమవారం సాక్షిలో 'తాగునీటి వృథాను అరికట్టరా?' కథనం ప్రచురితం అయింది. మున్సిపల్ కమిషనర్ ఎ.స్వామి, ఏఈ రాజేశ్ స్పందించారు. వెంటనే సిబ్బందితో మరమ్మతులు చేయించి, సమస్యను పరిష్కరించారు. దీంతో స్థానికులు 'సాక్షి'కి అభినందనలు తెలిపారు.

మొక్కలను రక్షించండి



వెంగన్నపాలెంలో మొక్క నాటుతున్న విద్యాలత

జూలూరుపాడు: నాటిన మొక్కలన్నింటినీ సంరక్షించాలని జెడ్పీ సీఈఓ విద్యాలత అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం, వెంగన్నపాలెం జీపీ కార్యాలయాన్ని జెడ్పీ సీఈఓ విద్యాలత ఆకస్మికంగా సందర్శించారు. ప్రభుత్వ కార్యాలయ సముదాయంలో నాటిన మొక్కలు, పల్లె ప్రకృతి వనాన్ని పరిశీలించారు. 77వ స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని వెంగన్నపాలెం జీపీ కార్యాలయంలో మొక్కలు నాటి మేరీ దేశ్.. మేరీ మిట్టీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మాట్లాడుతూ.. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా మంగళవారం మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలు, ప్రభుత్వ కార్యాలయాల్లో మొక్కలు నాటాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీఓ తులసీరామ్, ఈజీఎస్ ఏపీఓ రవికుమార్, వెంగన్నపాలెం సర్పంచ్ గలిగె సావిత్రి, పంచాయతీ కార్యదర్శి పి.కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే ప్రజా శ్రేయస్సు



ఇల్లెందు:వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఇల్లెందు: టీపీసీసీ పిలుపు మేరకు ఈ నెల 17 నుంచి పట్టణంలోని 24 వార్డులలో గడప గడపకు కాంగ్రెస్‌ను తీసుకెళ్తామని కాంగ్రెస్ జిల్లా నాయకుడు, జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య అన్నారు. సోమవారం ఇల్లెందులోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో టీపీసీసీ ముద్రించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. మాట్లాడుతూ.. పట్టణంలో ఎనిమిది రోజుల పాటు ఈ కార్యక్రమం ఉంటుందని నాయకులు, కార్యకర్తలు తరలి వచ్చి ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో బొళ్ల సూర్యం, భార్గవ్, సాంబమూర్తి, సదానందం, ఇమామ్, నందకిషోర్, పత్తి స్వప్న తదితరులు పాల్గొన్నారు.

జూలూరుపాడు: ప్రజా శ్రేయస్సు కాంగ్రెస్‌తోనే సాధ్యమని ఆ పార్టీ వైరా నియోజకవర్గ నాయకురాలు బానోత్ విజయాబాయి అన్నారు. సోమవారం అనంతారం గ్రామంలో ఆమె పర్యటించారు. గడగడపకు వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను వివరించడంతోపాటు, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత చేపట్టే సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో లేళ్ల వెంకటరెడ్డి, దుద్దుకూరి మధుసూదన్‌రావు, బొడ్డు కృష్ణయ్య, నర్వనేని పుల్లారావు, ముత్తినేని రామయ్య, వందనపు సత్యనారాయణ, పోతురాజు నాగరాజు, ఉసికల వెంకటేశ్వర్లు, రమేష్, గుగులోత్ బాలాజీ, తాళ్లూరి లక్ష్మయ్య, సాయిల కృష్ణయ్య, మందా సురేష్, దేవేందర్, పి.సతీష్, మేకల రామారావు, బండారి నవీన్, బొర్రా ఉపేంద్ర పాల్గొన్నారు.

రెండో ఏఎన్‌ఎంలను రెగ్యులర్ చేయాలి



జూలూరుపాడు: తహసీల్దారుకు నోటీస్ అందజేస్తున్న సెకండ్ ఏఎన్‌ఎంలు

జూలూరుపాడు/సుజాతనగర్/టేకులపల్లి: చాలీచాలని వేతనాలతో ప్రజారోగ్య రక్షణే లక్ష్యంగా నిరంతరం శ్రమిస్తున్న రెండో ఏఎన్‌ఎంలను షరతులు లేకుండా రెగ్యులర్ చేయాలని కోరుతూ రెండో ఏఎన్‌ఎంలు సోమవారం టేకులపల్లి, సుజాతనగర్, జూలూరుపాడు తహసీల్దార్లకు వినతిపత్రాలు అందజేశారు. మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం జూలై 26న జారీ చేసిన మల్టీపర్పస్ హెల్త్ వర్కర్ నోటిఫికేషన్ 2/2023ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మంగళవారం కల్లా సమస్యలు పరిష్కరించకుంటే ఈనెల 16 నుంచి నిరవధిక సమ్మె చేస్తామని స్పష్టం చేశారు.15 రోజులుగా చర్చలకు పిలుస్తారని ఎదురుచూసినా పిలవకపోవడంతో సమ్మెలోకి వెళ్తున్నట్లు తెలిపారు.


ఎక్కడా లేనిది ఇక్కడే ఎందుకు?



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న స్థానికులు

టేకులపల్లి: టేకులపల్లి సెంటర్‌కు చెందిన హైవే బాధితులు ఆందోళన బాట పట్టారు. ఎక్కడా లేని విధంగా కేవలం టేకులపల్లిలోనే రోడ్డు ఎక్కు వెడల్పు చేస్తుండటంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టేకులపల్లి సెంటర్‌లో వై జంక్షన్ పేరుతో రోడ్డు విస్తరణ చేయడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. బాధితుల ఆందోళనా కార్యక్రమాల్లో భాగంగా సోమవారం అఖిలపక్షం ఆధ్వర్యంలో తహసీల్దార్ కృష్ణవేణికి వినతిపత్రం అందజేసి సమస్య తీవ్రతను వివరించారు. అఖిలపక్షం నాయకులు, బాధితులు లక్కినేని సురేందర్‌రావు, ధర్మపురి వీరబ్రహ్మాచారి, గుడిపూడి మోహన్‌రావు మాట్లాడుతూ... గౌరెల్లి నుంచి ఇల్లెందు వరకు రెండు లేన్ల రహదారి నిర్మాణం, ఇల్లెందు నుంచి కొత్తగూడెం వరకు నాలుగు లేన్ల రహదారి నిర్మాణం చేపడుతుండటం, ఎక్కడా లేని విధంగా టేకులపల్లి మండలంలోనే జంక్షన్ల వద్ద విస్తరణ చేపడుతుండటం, డివైడర్లు ఏర్పాటు చేస్తుండటం ఏమిటని ప్రశ్నించారు. వై జంక్షన్ పేరుతో టేకులపల్లి సెంటర్‌లో బోడు రోడ్డు వైపు వంద అడుగుల మేరకు మార్కింగ్ చేయడం వల్ల సుమారు 30 వరకు నివాసాలు, వ్యాపార సముదాయాలు కనుమరుగవుతాయని, సర్వం కోల్పోయి రోడ్డున పడాల్సిన వస్తోందని వాపోయారు. నష్టం జరగకుండా వై జంక్షన్ విస్తరణపై పునరాలోచించాలని, ప్రత్యామ్నాయంగా బైపాస్ కానీ, ఫ్లై ఓవర్ కాని నిర్మించాలని సూచించారు. తొలుత బాధితులతో కలిసి టేకులపల్లి సెంటర్‌లో బానోతు హరిసింగ్ నాయక్ పర్యటించారు. ఎమ్మెల్యే ద్వారా ఎంపీ, మంత్రితో మాట్లాడి బైపాస్ కోసం ప్రయత్నం చేద్దామన్నారు.

సింగరేణిలో రూ.లక్షలు వృథా



కార్పొరేట్ జీఎం పర్సనల్ కార్యాలయంలో టైల్స్ పైన టైల్స్ వేస్తున్న దృశ్యం

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి బొగ్గు కార్మికులు కష్టపడి బొగ్గును ఉత్పత్తి చేసి సంస్థకు రూ.కోట్ల లాభాన్ని ఆర్జించి పెడతారు. కానీ అధికారులు మాత్రం ఇష్టారాజ్యంగా రూ.లక్షలు ఖర్చు చేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఎనిమితేళ్ల క్రితం రూ.కోట్లతో నిర్మించిన కార్పొరేట్ జీఎం కార్యాలయ భవనంలో ఇప్పుడు రినోవేషన్ పేరుతో వేసిన టైల్స్‌పైనే మళ్లీ టైల్స్ వేయిస్తుండాన్ని పలువురు తప్పుపట్టారు. కార్పొరేట్ కార్యాలయంలోనే ఇలా ఉంటే ఇతర ఏరియాల్లో పరిస్థితి ఏంటని కార్మికులు ప్రశ్నిస్తున్నారు.

రోళ్లపాడు ప్రాజెక్టు పూర్తి చేయించండి



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఇల్లెందు: రోళ్లపాడు ప్రాజెక్టును మొదట రూపొందించి డీపీఆర్ ఆధారంగానే చేపట్టి పూర్తి చేయాలని అఖిలపక్షం నాయకులు కోరారు. ఈ సందర్భంగా నాయకులు జె.సీతారామయ్య, ఎస్.ఏ.నబీ, బంధం నాగయ్య, ఎస్.రాజు, సారంగపాణి తదితరులు సోమవారం ఇల్లెందులో ఎమ్మెల్యే హరిప్రియకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. రోళ్లపాడు ప్రాజెక్టుతో ఇల్లెందు నియోజకవర్గం సస్యశ్యామలం అవుతుందని చెప్పి... ఇప్పుడు సీతారామ ప్రాజెక్టు రీడిజైన్‌తో రోళ్లపాడు కనుమరుగవుతోందని తెలిపారు. ఏదిఏమైనా రోళ్లపాడులోనే ప్రాజెక్టు నిర్మించాలని కోరారు. ఎన్డీ చంద్రన్న వర్గం, మధు వర్గం, సీపీఐ, సీపీఎం, ప్రజాపంథా, కాంగ్రెస్, టీడీపీ, వైఎస్సార్ టీపీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా తీజ్ వేడుకలు...

ఇల్లెందురూరల్: లక్ష్మీనారాయణతండా గ్రామంలో తీజ్ వేడుకలను సోమవారం రాత్రి గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. తొమ్మిది రోజులపాటు ఉపవాస దీక్షతో గోధుమ మొలకలు పెంచిన యువత బంజారా దేవతకు ప్రత్యేక పూజ చేసి సంప్రదాయ పద్ధతిలో ఆడిపాడారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ, ఎంపీపీ చీమల నాగరత్నమ్మ తీజ్ బుట్టలు తలపై పెట్టుకొని ప్రదర్శనలో పాల్గొన్నారు. అనంతరం తీజ్ బుట్టలను మేళతాళాలతో ఊరేగింపు నిర్వహించి చెరువులో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బానోత్ సంతు, ఖమ్మంపాటి రేణుక, వైస్ ఎంపీపీ ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమించొద్దు



పాల్గొన్న చైర్మన్, అధికారులు, వార్డ్ ఆఫీసర్లు

ఇల్లెందు: గృహలక్ష్మి పథకం ఎంపిక సందర్భంగా ప్రభుత్వం రూపొందించిన నిబంధనలు అతిక్రమించరాదని మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం ఇల్లెందులోని మున్సిపల్ కార్యాలయంలో వార్డు ఆఫీసర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సొంత స్థలం ఉన్నవారికి ఒక్కో ఇంటికి ప్రభుత్వం రూ.3 లక్షల సహాయం అందించనుందని తెలిపారు. దరఖాస్తుదారుల ఇంటికి వెళ్లి సర్వే నిర్వహించాలని అర్హులకు అన్యాయం జరగరాదన్నారు. తహసీల్దార్ రవికుమార్ మాట్లాడుతూ.. కుల ధ్రువీకరణ పత్రం, ఖాళీ స్థలం, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్స్ తప్పకుండా ఉండాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ బాలరాజు, కమిషనర్ కుమారస్వామి, డీఈ నవీన్ పాల్గొన్నారు.

జూలూరుపాడు: గృహలక్ష్మి పథకానికి అర్హులను గుర్తించాలని ఎంపీడీఓ వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. మాట్లాడుతూ.. గృహలక్ష్మి పథకానికి మండలంలో 3,423 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. వీటిని ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఇతర కులాల వారీగా విభజన చేసుకోవాలని సెక్రటరీలకు సూచించారు. దరఖాస్తుదారుల ఇళ్లకు పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శారద, ఎంపీఓ తులసీరామ్, ఈజీఎస్ ఏపీఓ రవికుమార్, జీపీ సెక్రటరీలు పాల్గొన్నారు.

హైపవర్ వేతనాలు చెల్లించాలి



మాట్లాడుతున్న నాగేశ్వరరావు

సింగరేణి(కొత్తగూడెం): కోలిండియా మాదిరిగా సింగరేణిలో కూడా కాంట్రాక్ట్ కార్మికులకు హైపవర్ వేతనాలు చెల్లించాలని సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి ఇనపనూరి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం కార్పొరేట్ కార్యాలయంలోని బంగ్లోస్ ఏరియాలో జరిగిన యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కోలిండియాలో 2013 నుంచి కోలిండియాలో హైపవర్ వేతనాలు చెల్లిస్తుండగా, సింగరేణిలో చెల్లించటం లేదన్నారు. 2022లో డిప్యూటీ సెంట్రల్ లేబర్ కమిషనర్ కార్యాలయంలో జరిగిన చర్చల్లో నెల రోజుల్లో కమిటీ వేసి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చిన యాజమాన్యం ఇప్పటి వరకు స్పందించ లేదని ఆరోపించారు. కార్యక్రమంలో దొడ్డి నిర్మల, ఎడ్ల రాకేష్, రంజిత్‌కుమార్, విజయ్, కృష్ణమూర్తి, ఆదిలక్ష్మి, సుక్కయ్య, సుజాత, రాజేశ్వరి, హసీనా తదితరులు పాల్గొన్నారు.

'విశ్వరూప'ను విజయవంతం చేయండి



నినాదాలు చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

పాల్వంచరూరల్: హైదరాబాద్‌లో ఈనెల చివరన తలపెట్టిన విశ్వరూప మహాసభకు మాదిగలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజవయంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ ఏపూరి వెంకటేశ్వరరావుమాదిగ కోరారు. మండలంలోని నాగారం గ్రామంలో సంఘం కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయిన మాట్లాడారు. లక్ష్యసాధనలో జాతిని గెలిపించడానికి యువత కేంద్రబిందువు కావాలన్నారు. మహాసభ విజయవంతం చేయడానికి ప్రతి మాదిగ బిడ్డ శ్రమించాలని కోరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కేశుపాక నాగరాజు, కోకన్వీనర్‌గా కె.సృజన్‌లను ఎన్నుకున్నారు. కొత్తపల్లి సోమయ్య, గంగపూరి శ్రీను, చర్ల వెంకటప్పయ్య, దాసరి యాకయ్య, మిర్యాల వెంకటేశ్వర్లు, తిరుపతయ్య పాల్గొన్నారు.